సాక్షి
కుమురం భీం

బుధవారం ; 24 ; సెప్టెంబర్ ; 2025



మార్కెట్లకు దసరా జోష్.. 8లో▸

జీఎస్టీ స్లాబులను సవరించడంతో కిరాణా సరుకులు, గృహోపకరణాల ధరలు దిగివస్తున్నాయి. ఈ ఏడాది బతుకమ్మ, దసరా పండుగలకు పెద్దఎత్తున వ్యాపారం జరగనుంది.



గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యం

గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యంగా అధికారులు 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు చేపడుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు అవగాహన కల్పిస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.3 /25.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అల్పపీడనం ప్రభావంతో అక్కడక్కడ మోస్తరు వానలు కురిసే అవకాశం ఉంది.

అర్ధరాత్రి అమ్మకాలు!

కౌటాల మండలం శీర్షా గ్రామంలోని శ్రీఆంజనేయ ట్రేడర్స్, శ్రీకొండయ్య ట్రేడర్స్‌లో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన యూరియా బస్తాలను ఈ నెల 20న వ్యవసాయ అధికారులు పట్టుకున్నారు. మంచిర్యాల నుంచి రెండు లారీల్లో 523 యూరియా బస్తాలు తెచ్చి డీలర్లు రాత్రికి రాత్రే అధిక ధరలకు రైతులకు అమ్మేశారు. విషయం తెలుసుకున్న అధికారులు విచారణ చేపట్టి నిల్వ ఉంచిన 118 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.



కౌటాల రైతువేదిక వద్ద మంగళవారం యూరియా కోసం బారులు తీరిన రైతులు

సిర్పూర్(టి) మండలం భూపాలపట్నంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ దుకాణానికి ఈ నెల 19న అర్ధరాత్రి లారీలో 19.98 మెట్రిక్ టన్నుల యూరియా లోడ్ వచ్చింది. వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వకుండా బస్తాలను విక్రయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బస్తాలతోపాటు లారీని స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి దందా చేసిన ఫర్టిలైజర్ షాపులో అమ్మకాలను నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

- జిల్లాలోకి అక్రమంగా యూరియా సరఫరా
- రాత్రిపూట రైతులకు అధిక ధరలకు విక్రయం
- అన్నదాతల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు

కౌటాల(సిర్పూర్): వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఎరువులు వేయడానికి రైతులు గతంలో ఎప్పుడూ లేనివిధంగా అవస్థలు పడుతున్నారు. రైతువేదికలు, పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న ఫర్టిలైజర్ షాపుల యజమానులు అక్రమ దందాకు తెరతీస్తున్నారు. అర్ధరాత్రి అక్రమంగా అధిక ధరలకు బస్తాలు అమ్ముతున్నారు.

60 వేల మెట్రిక్ టన్నులు అవసరం

జిల్లాలో 1.42 లక్షల మంది రైతులు వానాకాలం సీజన్‌లో 4.40 లక్షల ఎకరాల్లో పత్తి, వరి, కంది, తదితర పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు ఈ సీజన్‌లో 60 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా.. ఇప్పటివరకు 40 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారు. మరో 20 వేల మెట్రిక్ టన్నుల లోటు ఉంది. సహకార సంఘాల్లో ఎన్ని ఎకరాల భూమి ఉన్నా పట్టా పుస్తకానికి కేవలం రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. జూలై, ఆగస్టులో యూరియా కోసం పట్టాపత్రాలు అందించిన వారికి ఈ నెల 20వ తేదీ వరకు అందించారు. పట్టా పాసుపుస్తకం అందించిన నెలన్నర రోజుల తర్వాతగానీ రైతులకు యూరియా అందడం లేదు. మరోవైపు పట్టాలు లేని కౌలు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

అక్రమంగా దిగుమతి చేసుకుని..

ప్రస్తుతం పత్తి పంట పూతకాత దశలో ఉండగా.. వరి ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఎరువులు వేసే సమయం కావడంతో రైతులు బస్తాల కోసం తండ్లాడుతున్నారు. ఇదే అదనుగా భావించి కొందరు ప్రైవేట్ వ్యాపారులు లారీల్లో అక్రమంగా యూరియాను మహారాష్ట్ర, ఇతర జిల్లాల నుంచి తీసుకువస్తున్నారు. అధిక ధరలకు రైతులకు రాత్రిపూట రహస్యంగా అమ్ముతున్నారు. బస్తాల కోసం రోజుల తరబడి తిరిగి అలసిపోయిన అన్నదాతలు సహకార సంఘాలపై ఆశలు వదులుకుని డీలర్ల వద్దకు వెళ్తున్నారు. అసలు ధరకు నాలుగింతలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. రైతులే ముందస్తు డబ్బులు చెల్లించి ధర ఎంతైనా బస్తాలు ఇవ్వాలని డీలర్ల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, సరిపడా యూరియా పంపిణీ చేయడంలో విఫలమవ్వడం, యూరియాను ప్రైవేట్ వ్యాపారులకు కేటాయించారనే అభియోగాలపై జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావును ఆ శాఖ రాష్ట్ర సంచాలకుడు గోపి ఈ నెల 20న సస్పెండ్ చేశారు. కొరతపై జిల్లా రైతన్నలు రోడ్డెక్కడం సైతం డీఏవోపై చర్యలు తీసుకోవడానికి ఓ కారణంగా తెలుస్తోంది. అధికారులే నిబంధనలు పాటించకుండా ప్రైవేట్ వ్యాపారులకు మద్దతుగా నిర్ణయాలు తీసుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

దిగుబడిపై దిగులు



తలోడి శివారులో ఎరువులు వేయకపోవడంతో ఎదగని పత్తి మొక్కలు

యూరియా కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు నిత్యం బారులు తీరుతున్నారు. పోలీసుల పహారాలో పంపిణీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాగు పనుల్లో ఉండాల్సిన అన్నదాతలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో పంటలకు సకాలంలో ఎరువులు వేయడం వీలుకావడం లేదు. మొక్కల్లో ఎదుగుదల లోపించి ఎర్రబారుతున్నాయి. కలుపు కూడా విపరీతంగా పెరగడంతోపాటు తెగుళ్లు సోకుతున్నాయి. ఇది పంట దిగుబడి ప్రభావం చూపనుంది.

చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం

మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా యూరియా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. అక్రమ రవాణాను అరికట్టేందుకు వ్యవసాయశాఖ, పోలీసుశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి, సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం. అన్ని అనుమతులు ఉంటేనే యూరియా రవాణా చేయాలి.

– ఎండీ వహీదుద్దీన్, కాగజ్‌నగర్ డీఎస్పీ

న్యూస్‌రీల్

డీఐఈవోగా రాందాస్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఐఈవో రాందాస్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారిగా పట్టణంలోని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రాందాస్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, ఇప్పటివరకు డీఐఈవోగా పనిచేసిన కళ్యాణి ప్రమాదంలో గాయపడి సెలవుల్లోకి వెళ్లారు. ఆమె స్థానంలో రాందాస్ బాధ్యతలు స్వీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆరు నెలలపాటు(మార్చి 31) పనిచేసేందుకు అర్హత గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిసిటీ అసిస్టెంట్ ఫొటోగ్రాఫర్, వీడియో కెమెరామెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్‌కు పదో తరగతి విద్యార్హత, ఫొటో స్టూడియోలో ఐదేళ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలని, అలాగే వీడియో కెమెరామెన్‌కు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి సినిమాటోగ్రఫీ డిప్లొమా సమాన అర్హత ఉండాలన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 26లోగా జిల్లా కేంద్రంలోని డీపీఆర్‌వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఆదివాసీలకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): కెరమెరి అటవీశాఖ రేంజ్ పరిధిలో వాచర్, ఎనిమల్ ట్రాకర్ పోస్టుల్లో ఆదివాసీలకు అవకాశం కల్పించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గిరిజన చట్టాలు అమలులో ఉన్న గిరిజన మండలంలో ఆయా పోస్టుల్లో ఆదివాసీలెవరూ లేరని తెలిపారు. ఉన్నత చదువులు చదివిన వారు నిరుద్యోగంతో సతమతం అవుతున్నారని, అధికారులు ఆదివాసీలకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా సలహాదారుడు కనక ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొర్ల వెంకటేశ్, నాయకులు కుమురం మారుతి, ఆత్రం లక్ష్మణ్, బూత బాపూరావు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి జిల్లాకు రెండోస్థానం



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్ సెపక్‌తక్రా పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పురుషుల జట్టు రెండోస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన ఫైనల్‌లో ఉమ్మడి జిల్లా జట్టు హైదరాబాద్ జట్టుతో తలపడింది. హైదరాబాద్ జట్టు విజయం సాధించగా జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ చీఫ్ పాట్రాన్ ఆర్.నారాయణరెడ్డి, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, సెపక్‌తక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శిరీష, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు భాస్కర్, రామకృష్ణ, సాంబయ్య, షార్ప్ స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆస్పత్రి వద్ద మంగళవారం ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్, తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ అనుబంధ ఆసిఫాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌పై జరిగిన దాడిని ఖండించారు. వైద్యులపై దాడులు జరగడం దురదృష్టకరమన్నారు.

గాయత్రీదేవి అలంకరణలో దుర్గామాత



గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. దుర్గామాత భక్తులకు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి మంగళ హారతులతో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అలాగే గోలేటిలోని మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాతకు భక్తులు పూజలు నిర్వహించారు.

అడవుల రక్షణలో 'హంటర్'



కోయచిచ్చాలలో హంటర్ సేవలపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

- జిల్లాలోనూ డాగ్‌స్క్వాడ్ సేవలు
- అటవీ నేరాల అదుపునకు వినియోగిస్తున్న అటవీశాఖ

పెంచికల్‌పేట్(సిర్పూర్): అడవుల్లో అక్రమంగా ప్రవేశించి చెట్లను నరకడం, వన్యప్రాణులను వేటాడడం, స్మగ్లింగ్ వంటి నేరాలను నియంత్రించడానికి కవ్వాల్ అభయారణ్యంలో అధికారులు డాగ్‌స్క్వాడ్ సేవలను వినియోగిస్తున్నారు. గతంలో నేరస్తులను పట్టుకోవడానికి వినియోగించిన చీతా అనే డాగ్‌స్క్వాడ్ గుండెపోటుతో మరణించింది. దానిస్థానంలో ఆగస్టు 15న హంటర్ అనే డాగ్‌ను విధుల్లోకి తీసుకున్నారు. జిల్లా అటవీశాఖ అధికారులు హంటర్ సేవలను జిల్లాలోనూ వినియోగిస్తున్నారు. నేరస్తులను పట్టుకోవడంలో డాగ్‌స్క్వాడ్ సాయం తీసుకుంటున్నారు. అలాగే అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఏడు నెలల శిక్షణ..

బెల్జియం షెప్పర్డ్ మెలనాయిస్ జాతికి చెందిన హంటర్ జాగిలానికి మూడు నెలలు వయస్సు నుంచి హర్యానా రాష్ట్రంలోని పంచకుళ ఇండో టిబెట్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), నేషనల్ ట్రెనింగ్ సెంటర్ ఫర్ డాగ్స్ అండ్ ఎనిమల్స్(ఎన్‌టీసీడీ)లో శిక్షణ అందించారు. అడవుల్లో వాసన పసిగట్టడం, జంతువుల కదలికలు, అటవీ ఉత్పత్తులు, స్మగ్లర్ల కదలికలపై దాదాపు ఏడు నెలలపాటు శిక్షణ కల్పించారు. అలాగే జన్నారం అటవీ రేంజ్‌లో ఎఫ్‌బీవోలుగా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్, పరమేశ్ కూడా జాగిలం వినియోగంపై శిక్షణ తీసుకున్నారు. ఈ జాగిలం జన్నారం కేంద్రంగా కవ్వాల్ అభయారణ్యంలో జరిగే అటవీ నేరాలను అదుపు చేయడంతోపాటు అడవుల రక్షణ, నేరస్తులను పట్టుకోవడానికి వినియోగిస్తున్నారు. ఇటీవల జన్నారం రేంజ్ పరిధిలోని గోండుగూడ అటవీ ప్రాంతంలో టేకు చెట్లు నరికిన హీరాలాల్ అనే వ్యక్తిని పట్టుకుంది. సుమారు 8 నుంచి 10 ఏళ్లపాటు ఈ జాగిలం సేవలు అందిస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

చెట్లు నరికివేత, వన్యప్రాణుల వేట, అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణాను నిరోధించటానికి కవ్వాల్ రిజర్వు ఫారెస్టులో హంటర్ జాగిలం సేవలు వినియోగిస్తున్నారు. నూతనంగా విధుల్లో చేరిన జాగిలంతో జిల్లాలోని రేంజ్ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది, ఎనిమల్ ట్రాకర్స్‌కు సైతం అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో అటవీ నేరాలు నియంత్రించేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. జిల్లాలోనూ నేరస్తులను పట్టుకోవడానికి హంటర్ సేవలు సద్వినియోగం చేసుకుంటాం.

– నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, జిల్లా అటవీశాఖ అధికారి

వాగు దాటితేనే ఊరికి..



వాగు దాటుతున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్ మండలంలోని అప్పపల్లి, ఆర్‌ఆర్ కాలనీ ప్రజలు వాగు ఉప్పొంగి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.86 కోట్లు మంజూరు చేసింది. దీంతో గతేడాది వాగుపై ఉన్న కల్వర్టు తొలగించి వంతెన పనులు ప్రారంభించారు. పనులు మధ్యలోనే వదిలేయడంతో గ్రామానికి సరైన దారి లేకుండా పోయింది. మంగళవారం వాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు ఇలా ప్రమాదకరంగా వాగు దాటారు. వరద ఉధృతి పెరిగితే పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయని, అధికారులు స్పందించి వంతెన పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఆసిఫాబాద్‌రూరల్

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

ఆసిఫాబాద్‌అర్బన్: నిత్య జీవితంలో పనిఒత్తిడితో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం లేదని, ఆరోగ్యమే మహాభాగ్యమని గుర్తించాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్ శివాలయం ఆవరణలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వైద్యశిబిరంలో కీళ్లు, కాళ్ల నొప్పులు, హైబీపీ, జీర్ణ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులు, కిడ్నీలో రాళ్లు, జలుబు, దగ్గు ఇతర వ్యాధులకు ఆయుర్వేద ఔషధాలు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి వినోద్, డాక్టర్లు సుజాత, నరేందర్, రాకేశ్, ఫార్మసిస్టులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

'మైక్రో బ్రూవరీల ఏర్పాటు సరికాదు'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల ఏర్పాటు సరికాదని, ఎక్సైజ్‌శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అబ్కారీ శాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జ్యోతి కిరణ్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మైక్రో బ్రూవరీల ఏర్పాటుతో విద్యార్థులపై ప్రభావం పడుతుందని, మద్యం వినియోగం పెరిగి హింస, అశాంతికి దారి తీస్తుందన్నారు. ఇప్పటికే వైన్స్‌లు, బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని తెలిపారు. మైక్రో బ్రూవరీల నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, రాకేశ్, వికాస్ పాల్గొన్నారు.

తనిఖీలు కరువు.. కల్తీల జోరు

కాగజ్‌నగర్‌లోని ఓ మార్ట్‌లో పట్టణానికి చెందిన వ్యక్తి మిల్క్ మిస్ట్ ప్యాక్‌లను ఈ నెల 13న కొనుగోలు చేశాడు. కుమారుడికి దానిని తాగించగా అస్వస్థతకు గురయ్యాడు. మళ్లీ ఈ నెల 21న మళ్లీ అదే షాపునకు వెళ్లి మూడు మిల్క్‌మిస్ట్ పానీయాలు కొన్నాడు. బిల్లు చెల్లించి వాటిపై ఉన్న గడువు తేదీని పరిశీలించగా, ఈ నెల 4న ముగిసినట్లు ఉంది. ఈ విషయంపై షాపు యజమానులను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఇలా జిల్లాలోని అనేక దుకాణాలు, బేకరీలు, హోటళ్లలో కాలం చెల్లిన, కల్తీ వస్తువులు విక్రయిస్తున్నా అధికారులు తనిఖీలు చేపట్టడం లేదు.



- నిబంధనలు పాటించని బేకరీలు, హోటళ్లు..
- పాడైన, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, వస్తువులు విక్రయం
- వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు కొరవడడంతో షాపింగ్‌మాల్స్, కిరాణ షాపులు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్‌సెంటర్లలో ఎక్కువ కాలం నిల్వ ఉంచిన పదార్థాలు, కల్తీ చేసిన వస్తువులు విక్రయిస్తున్నారు. మార్టులు, షాపుల్లో కాలం గడువు ముగిసిన వాటిని వినియోదారులకు అంటగడుతున్నారు. ముఖ్యంగా వాణిజ్యపరంగా కీలకమైన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లోని హోటళ్లు, బేకరీలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. ఇక రోడ్ల పక్కనే నిర్వహించే హోటళ్లు, స్వీట్‌షాపులపై కనీస పర్యవేక్షణ లేకపోవడం ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది.

పట్టించుకునే వారేరి..?

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు కొరవడడంతో వినియోగదారుల ఆరోగ్య భద్రతను పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఇటీవల కాగజ్‌నగర్‌లోని ఓ మార్ట్‌లో ఒకరికి కాలంచెల్లిన మిల్క్‌మిస్ట్ ప్యాకెట్లు అంటగట్టారు. వినియోగదారుడు ప్రశ్నించగా.. ఇష్టం వచ్చిన చోట చెప్పుకోమని షాపు యజమాని దురుసుగా ప్రవర్తించాడు. బాధితుడు ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. కనీసం నెలకు ఒకసారి స్వీట్‌హౌస్‌లు, బేకరీలు, తినుబండారాలు విక్రయించే షాపుల్లో తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేమీ జిల్లాలో అమలు కావడం లేదు.

జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలు..

- ఆరు నెలల క్రితం కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ హోటల్‌లో కొందరు భోజనం చేస్తుండగా కూరలో పురుగులు వచ్చాయి. ఈ విషయం భోజన ప్రియులను కలవరపెట్టింది. ఆ సమయంలో అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి మమ అనిపించారు.
- దహెగాం మండల కేంద్రంలోని ఇటీవల ఓ హోటల్‌లో బూజు పట్టిన స్వీట్లు అమ్మగా, స్థానికులు నిలదీశారు. కౌటాల మండల కేంద్రంలోని ఓ షాపులోనూ యజమానులు బూజు పట్టిన బ్రెడ్ విక్రయించారు.
- రెండు నెలల క్రితం తిర్యాణి మండల కేంద్రంలోని కుమురంభీం చౌరస్తా సమీపంలో గల షాపులో కాలం చెల్లిన కేక్‌లు విక్రయించారు.

అంతా కల్తీయే..!

పండగలు, పుట్టిన రోజు, ఇతర ముఖ్యమైన రోజుల్లో సంతోషాన్ని పంచుకోవాలన్నా తీపితోనే మొదలవుతుంది. కానీ బేకరీలు, స్వీట్ షాపులు కల్తీ మిఠాయిలు విక్రయిస్తుండటంతో తిన్నవారు ఆస్పత్రుల పాలవుతున్నారు. వాడిన నూనెనే మళ్లీ వాడడం, రుచి కోసం రసాయనాలు వినియోగించడం, కల్తీ పాలు, నెయ్యి, ఇతర పదార్థాలను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధికారులు తూతూమంత్రంగా ఏడాదికి ఒకసారి జిల్లాలో తనిఖీలు చేపడుతున్నారు. నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేవలం రెండు, మూడు హోటళ్లు, స్వీట్‌షాపులను తనిఖీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లోని పలు హోటళ్లు నాణ్యత పాటించడం లేదని పలువురు పట్టణవాసులు ఫిర్యాదులు చేసినా నామమాత్రంగా నోటీసులు అందించగా, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తారాసింగ్ నాయక్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

చర్యలు తీసుకుంటాం

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని షాపింగ్ మాల్స్, స్వీట్‌షాపులు, హోటళ్లు, కిరాణ షాపుల్లో తనిఖీలు చేపడతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటాం. యజమానులు, నిర్వాహకులకు నోటీసులు అందించి శాఖ పరంగా చర్యలు చేపడుతాం.

– రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: జీవో నం.12ను సవరించి, భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పట్టణంలోని లేబర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణ, ఇతర కార్మిక సంక్షేమ బోర్డుల ద్వారా అమలు చేస్తున్న నాలుగు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చేందుకు ప్రభుత్వం జీవో 12ను విడుదల చేసిందని తెలిపారు. 1996 భవన నిర్మాణ కార్మికుల చట్టం నిబంధనల విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లను తిరిగి వెల్ఫేర్ బోర్డు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకిషన్, ఎస్కే గౌస్, జిల్లా కోశాధికారి ఆనంద్ రావు, కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

క్లుప్తంగా

ఇనుపరాడ్‌తో ఒకరిపై దాడి

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఒకరిపై ఇనుపరాడ్‌తో దాడిచేసిన ఘటనలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ జి.గోపీనాథ్ తెలిపారు. పట్టణానికి చెందిన బుడిగెవార్ స్నేహిత్, తన ముగ్గురు మిత్రులతో కలిసి సోమవారం రాత్రి రెండు బైక్‌లపై భైంసా వైపు బయలుదేరారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ఆసిఫ్ తన స్నేహితులతో కలిసి కారులో వస్తుండగా వీరి రెండు బైక్‌ల మధ్య నుంచి వేగంగా పోనిచ్చాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహిత్, అతని మిత్రులు ఐబీ వద్ద కారును గుర్తించి ఆపగా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఆసిఫ్ అక్కడే ఆటోలో ఉన్న ఇనుపరాడ్ తీసుకుని స్నేహిత్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆసిఫ్, పుర్హాన్, నిర్మల్‌కు చెందిన సోహెల్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కాకుండా బతుకమ్మ గద్దెను కారుతో ఢీకొట్టిన ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సుల్తానా బేగంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ తెలిపారు. సమావేశంలో ఎస్సై విష్ణు వర్ధన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడితే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: మత విద్వేషాలను రెచ్చగొట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జందాపూర్‌లో జరిగిన ఘటనపై నిందితురాలిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని, మహిళపై శాఖ పరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేశామన్నారు. ఘటనపై ప్రజలు ఎలాంటి దుష్ప్రచారం చేయకుండా ఉండాలని సూచించారు.

విద్యార్థి ఆత్మహత్య



శ్రావణ్ (ఫైల్)

ఖానాపూర్: తండ్రితో గొడవపడి కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని బీర్నందికి చెందిన కొండవీని రాజేందర్ కుమారుడు శ్రావణ్ (17) నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం పొలంలో యూరియా వేసేందుకు బస్తా తీసుకురమ్మని చెప్పగా నిరాకరించడంతో పాటు తండ్రితో గొడవపడ్డాడు. చేసేదేంలేక తల్లిదండ్రులు పొలం వద్దకు వెళ్లిపోయారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలుడు సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన అతని తమ్ముడు సాత్విక్ స్థానికుల సాయంతో కిందికి దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ శివారులో మంగళవారం ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బెల్లంపల్లి నుంచి భీమిని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు జన్కాపూర్ శివారులోని మూలమలుపు వద్ద భీమిని మండలం నుంచి బైక్‌పై బెల్లంపల్లి మండలంలోని చాకేపల్లికి వెళ్తున్న వినోద్‌ను ఢీకొట్టింది. యువకుడికి గాయాలు కావడంతో 108లో బెల్లంపల్లికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

వాహనదారుడిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బైక్‌కు ఫేక్ నంబర్ ప్లేట్‌తో తిరుగుతున్న ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం సిరికొండకు చెందిన ఇంద్రూ తన బైక్‌కు టీఎస్ 01 ఈఎల్ 4565 నంబర్ ప్లేట్‌తో వెళ్తుండగా తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ ఎస్సై మహేందర్ పట్టుకున్నారు. పరిశీలించగా వాహనం అసలు నంబర్ ఎంహెచ్ 29 బీజీ 0885 అని గుర్తించారు. దీంతో వాహనాన్ని స్వాధీనం చేసుకొని టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.

పొలాల్లో మృతదేహం లభ్యం

ఖానాపూర్: పట్టణంలోని గాంధీనగర్ శివారులో పంట పొలాల మధ్య మృతదేహం లభ్యమైంది. కాలనీకి చెందిన యువకుడు కత్తెరపాక శ్రీనివాస్ (45) ఐదురోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం కాలనీ శివారులో రహదారిపక్కన మృతదేహాన్ని గమనించిన స్థానికులు శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతునికి భార్యాపిల్లలు లేరని తెలిసిన వారిని డబ్బులు అడుక్కుని మద్యం సేవిస్తుంటాడని పేర్కొన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగు బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ అజీమ్(40) అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్ నుంచి ఆసిఫాబాద్‌కు సోదరుడు అష్రఫ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా పెద్దవాగు సమీపంలోని మూలమలుపు వద్ద ఐచర్ వ్యాన్ ఢీకొట్టగా కింద పడిపోయారు. ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో అజీమ్ అక్కడికక్కడే మృతి చెందాగా అష్రఫ్‌కు గాయాలయ్యాయి. అష్రఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మార్కెట్లకు దసరా జోష్..

- పండుగ నేపథ్యంలో ఊపందుకున్న షాపింగ్
- తగ్గిన జీఎస్టీతో పెరగనున్న కొనుగోళ్లు
- అన్ని దుకాణాల్లో కనిపిస్తున్న ఆఫర్లు
- ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరగనున్న వ్యాపారం



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల సందడి



మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులపై జీఎస్టీ స్లాబులను సవరించడంతో ఈ ఏడాది బతుకమ్మ, దసరా పండుగలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యాపారం జరగనుంది. ముఖ్యంగా కిరాణా సరుకులు, గృహోపకరణాలపై జీఎస్టీ తగ్గించడంతో వాటి ధరలు దిగివస్తున్నాయి. కొత్త పన్నురేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చాయి. మరోవైపు స్లాబుల సవరణతో వస్త్ర, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ఏటా బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బట్టలు తప్పనిసరిగా కొనుగోలు చేస్తారు. మంచిర్యాల జిల్లా సింగరేణి ప్రాంతం కావడం, ఏటా దసరాకు సంస్థ లాభాల వాటాను కార్మికులకు ఇస్తుండడం కూడా ఈ ప్రాంతంలో వ్యాపారం పెద్దఎత్తున జరిగేందుకు దోహదపడుతుంది. ప్రజలకు అందుబాటు ధరలతో పాటు, పలు రకాల ఆఫర్లు ప్రకటించి దుకాణదారులు ఆకట్టుకుటున్నారు.

వస్త్ర వ్యాపారం ఎక్కువే..

వస్త్ర వ్యాపారులకు ఏడాది మొత్తంలో ఎక్కువగా అమ్మకాలు జరిగేది కేవలం బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలోనే. దీంతో ఇప్పటికే ప్రజలను ఆకర్షించేందుకు రాయితీలు ఇస్తున్నారు. ఒక్కో దుకాణదారు మరో దుకాణదారుతో పోటీ పడుతూ 50 శాతం వరకు తగ్గింపు ధరకు అందిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో ప్రతీనెల రూ.5 కోట్ల మేర వస్త్ర వ్యాపారం జరుగుతుండగా కేవలం ఒక్క దసరా సీజన్‌లోనే రూ.15 కోట్లకు పైగా జరుగుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో

గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీ 18 శాతానికి తగ్గించడంతో ఒక్కో టీవీ, ఏసీల ధర రూ.2,500ల నుంచి రూ.20 వేల వరకు తగ్గాయి. ద్విచక్ర వాహనాలు, కార్లకు వాటి ధరలను బట్టి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు తగ్గాయి. ఏటా దసరాకు ఎలక్ట్రానిక్ వస్తువులు జిల్లాలో రూ.20 కోట్ల వరకు వ్యాపారం జరిగితే ఈ ఏడాది రూ.25 కోట్లకు పైగా జరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దసరా పండుగ వేళ దాదాపుగా రూ.60 కోట్లకు పైగా వ్యాపారం జరిగే అవకాశం ఉంది.

గిరాకీ పెరుగుతోంది



బెల్లంపల్లి: పండుగ వ్యాపారం ఇంకా పుంజుకోలేదు. రెండు రోజుల నుంచి కొనుగోలుదారుల సంఖ్య కాస్త మెరుగు పడింది. చిన్నారులు, ఆడబిడ్డలతో కలిసి వచ్చి వారికి నచ్చిన బట్టలు కొనుగోలు చేస్తున్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లింపులు జరిగితే వస్త్ర వ్యాపారం ఊపందుకుంటుంది.
– సాంబారి నర్సయ్య, వస్త్ర వ్యాపారి, బెల్లంపల్లి

అమ్మకాలు పెరుగుతాయి



జీఎస్టీ తగ్గుదలతో ఎలక్ట్రానిక్ వస్తువులపై దాదాపు 10 శాతం వరకు తగ్గింపు ఉంటుంది. ఏసీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, టీవీలపై కంపెనీ ఆఫర్లతో పాటు మేము కూడా ఆఫర్లు ప్రకటిస్తున్నాం. దీంతో అమ్మకాలు పెరుగుతాయి.
– అమిత్ లడ్డా, వ్యాపారి, మంచిర్యాల

ధర తగ్గిందనే కొనుగోలు



ఎలక్ట్రానిక్స్ వస్తువులపై కేంద్రం జీఎస్టీని తగ్గించడంతో టీవీ, ఫ్రిడ్జ్ కొనుగోలు చేయాలని షాప్‌కు వచ్చాం. 43 ఇంచుల నుంచి ఉన్నటీ వీల ధరలు కొంత అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం ఫ్రిడ్జ్ కొనుగోలు చేశాం. పండుగల సమయాల్లో ఆఫర్లకు తోడు జీఎస్టీ తగ్గింపు కలిసొచ్చింది. – దేవరాజ్, సబ్బెపల్లి, మంచిర్యాల

ఏసీ కొనుగోలు చేశాం



ఏసీలపై గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో పది శాతం వరకు ధరలు తగ్గాయి. వీటితో పాటు బతుకమ్మ, దసరా నేపథ్యంలో పలు కంపెనీలు ఆఫర్లు ప్రకటించాయి. తగ్గిన జీఎస్టీతో ధరలో 10 శాతం తగ్గిందని ఏసీని కొనుగోలు చేశాం.
– కిరణ్‌కుమార్, హమాలివాడ, మంచిర్యాల

ఊరట లభించింది



కేంద్రం జీఎస్టీని తగ్గించడంతో మధ్యతరగతి ప్రజలకు కొంత ఊరట లభించినట్లయ్యింది. దీంతో ఎలక్ట్రానిక్స్, వాహనాల ధరలు తగ్గిపోయాయి. ఈ తగ్గింపు తో పండుగకు బట్టలను కొనుగోలు చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. జీఎస్టీ తగ్గింపు తమకు ఊరటను ఇచ్చింది. – సూరి, మంచిర్యాల

ఎల్‌ఈడీ టీవీ కొన్నా..



భైంసాటౌన్: ఏటా దసరా పండుగకు ఏదో ఒక వస్తువు కొనుగోలు చేస్తుంటాం. ఈసారి టీవీలపై ఆఫర్లు ఉండడంతో ఎల్ ఈడీ టీవీ కొనుగోలు చేశాం. 43 ఇంచెస్ పైబడిన టీవీలపై జీఎస్టీ తగ్గడంతో కొనుగోలు చేశాం. సంతోషంగా ఉంది. – ఉష, నిర్మల్

కొత్తబైక్ తీసుకుంటా



భైంసాటౌన్: కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో వాహనాల ధరలు తగ్గాయి. ఈ దసరా పండుగకు కొత్త బైక్ కొనుగోలు చేయాలని అనుకున్నా. ముందుగా షోరూంలో ధర, మోడల్ వివరాలు తెలుసుకున్నా. పండుగకు తప్పకుండా కొత్త బైక్ తీసు కుంటా.
– జోగు చంద్రశేఖర్, నిర్మల్

గిరాకీ బాగుంది



భైంసాటౌన్: దసరా పండుగ సందర్భంగా దుస్తుల కొనుగోళ్లు పెరిగాయి. రకరకాల మోడళ్లు అందుబాటులో ఉంచుతున్నాం. కొనుగోలుదారుల అభిరుచిని బట్టి స్టాకు తెప్పిస్తున్నాం. ప్రస్తుతానికి గిరాకీ బాగుంది.
– గంగాధర్, డ్రెస్సెస్, భైంసా

కొత్త బట్టలు కొన్నాం

భైంసాటౌన్: దసరా పండుగకు కొత్త బట్టలు కొనుగోలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. బతుకమ్మ పండుగ కూడా కావడంతో పిల్లలకు, ఫ్యామిలీ అంతా కలిసి బట్టల షాపింగ్ చేసేశాం. ధరలు కూడా తగ్గాయి.
– సౌమ్య, భైంసా

ఎప్పట్నుంచో టీవీ కొనాలనుకుంటున్నా



ఆదిలాబాద్: ఎప్పటి నుంచో స్మార్ట్ టీవీ కొనాలనుకుంటున్నా. ధరలు అధికంగా ఉంటున్నాయి. టీవీలపై జీఎస్టీ 18 శాతానికి తగ్గించడంతో ధరలు తగ్గాయి. మరోవైపు దసరా పండుగ కూడా కలిసి వచ్చింది. అప్పటితో పోలిస్తే రూ.3వేల వరకు తగ్గుతున్నాయి. ఇప్పుడు కొనుగోలు చేయాలనుకుంటున్నా.
– పిట్ల అశోక్, కౌఠ (బీ), బోథ్

ఆహ్వానించదగ్గ విషయం



ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబులను సవరించడం ఆహ్వానించదగ్గ విషయం. దసరా, దీపావళి సందర్భంగా వాహనాలు కొనడం ఆనవాయితీగా వస్తుంది. రూ.వేలల్లో ధరలు తగ్గిస్తూ షోరూం నిర్వాహకులు ఆఫర్లు ఇస్తున్నారు. అయితే మనకు ఎంత లాభం అనేది చూసి కొంటే బాగుంటుందని అనుకుంటున్నా. – గిద్దు ప్రవీణ్, కొత్త కుమ్మరివాడ, ఆదిలాబాద్

కొనుగోళ్లు పెరిగాయి



ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా కొన్ని అంశాలను సున్నా శాతానికి తగ్గించడం గొప్ప నిర్ణయం. నిత్యావసరాలు సామాన్యులకు అందుబాటులోకి వస్తాయి. దసరా నేపథ్యంలో గతంతో పోలిస్తే దాదాపుగా 10 నుంచి 20 శాతం కొనుగోళ్లు పెరిగాయి. – దినేష్ మటోలియా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

'రెడీమేడ్' కొనేవారికి లాభమే..



ఆదిలాబాద్: రెడీమేడ్ దుస్తులకు స్లాబులను తగ్గించారు. రూ.వెయ్యి వరకు కొనుగోలు చేసేవారికి 5 శాతం, రూ.2500 వరకు కొనుగోలు చేసే వారికి 12 శాతం జీఎస్టీ పడేది. దాన్ని సవరించి రూ.2500 వరకు కొనుగోలు చేసే దుస్తులకు రూ.5 శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చారు. – సాయికృష్ణ చెల్లవార్, షాపింగ్ మాల్ నిర్వాహకుడు

గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్లకు పోస్టింగ్



నియామక పత్రాలు అందజేస్తున్న జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లకు ప్రభుత్వం తీపికబురు అందించింది. టీఎస్‌పీఎస్సీ 2017లో గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో 325 పోస్టులను భర్తీ చేయనున్నట్లు అందులో పొందుపరిచారు. 2018లో 285 మందికి పోస్టింగ్ కల్పించారు. రిమ్స్‌లో ఉద్యోగం లభించిన 19 మందికి పోస్టింగ్ ఇవ్వలేదు. రిమ్స్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో ఎంపికైన అభ్యర్థులు సైతం కోర్టులో పిటిషన్ వేశారు. ఎనిమిదేళ్ల తర్వాత వీరి పక్షాన కోర్టు తీర్పు వెలువరించింది. ఫిబ్రవరిలో వీరికి పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటీవల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టి 11 మందికి రిమ్స్ మెడికల్ కళాశాలలో, ఆరుగురికి రిమ్స్ ఆస్పత్రిలో పోస్టింగ్ కల్పించారు. మంగళవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ వారికి నియామకపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు సంబంధించి వివిధ పరీక్షలను సకాలంలో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వుషూ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నస్పూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాధన గ్రీన్ కిడ్స్ పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా అండర్–17, 19 బాలబాలికల వుషూ జట్లను ఎంపిక చేశారు. సుమారు 70 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–19 విభాగంలో జి.ఆదిత్య, బి.లలిత, టి.చందన, అండర్–19 విభాగంలో ఆర్.కృష్ణ, ఈ.యశ్వంత్, ఆర్.యువరాజ్, ఆదర్శకుమార్, రాజేశ్వరి, సీహెచ్ మహిత, ఎస్.రుచిత, జే.మన్వి, ఎస్.అన్విత, సీహెచ్ రక్షిత, ఐ.హర్షిత, ఎండీ కరిష్మా ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25 నుంచి 27 వరకు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బాబురావు, మంచిర్యాల జిల్లా సెక్రెటరీ యాకూబ్, ఆసిఫాబాద్ జిల్లా సెక్రెటరీ వెంకటేశ్, ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శివమహేశ్, పాఠశాల కరస్పాండెంట్ పెంచాల శ్రీధర్, పీఈటీలు సుదీప్, రాజేందర్, దేవయ్య, సాయికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉచ్చుకు ఒకరు బలి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన
- నేడు రీ పోస్టుమార్టం

ఇచ్చోడ: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బావోజీపేట్‌లో పంట రక్షణకోసం రైతు పెట్టిన విద్యుత్ ఉచ్చుకు తాకి అదే గ్రామానికి చెందిన మండాడి రంబు (50) మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన చిక్రం పాండు అడవి జంతువుల బారి నుంచి తన పంటను రక్షించుకునేందుకు శనివారం విద్యుత్ ఉచ్చులను అమర్చాడు. అటుగా వెళ్లిన పక్క పొలం రైతు రంబుకు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం బయటకు రాకుండా గ్రామానికి చెందిన కొంతమంది మరుసటి రోజు శవాన్ని పూడ్చివేశారు. మృతుని సమీప బంధువుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై పురుషోత్తం మంగళవారం గ్రామంలో విచారణ సాగించారు. మృతదేహాన్ని పూడ్చిపెట్టిన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం మృతదేహాన్ని బయటకు తీసి రీ పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగి నిజాయతీ



బ్యాగు అందిస్తున్న డిపో అధికారులు

ఆదిలాబాద్: ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్ళిన ఆర్టీసీ బస్సులో మంగళవారం గుడిహత్నూర్ మండలం సీతాగోంది గ్రామానికి చెందిన సురయ్యా అనే మహిళ బ్యాగ్ మర్చిపోయింది. బస్సు ఆదిలాబాద్ డిపోకు వచ్చిన తర్వాత గుర్తించిన కండక్టర్ స్వామి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వివరాలు తెలుసుకున్న అధికారులు ఈ బ్యాగ్ సురయ్యాదేనని నిర్ధారించుకొని బ్యాగును సదరు బాధితురాలికి అప్పగించారు. బ్యాగులో రూ.32వేల నగదు, 2.5 గ్రాముల బంగారం ఉండడం గమనార్హం. ఆర్టీసీ ఉద్యోగి తమ బ్యాగును నిజాయితీగా అందించడం పట్ల బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

సారంగాపూర్: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్టులోకి వరదనీటి ప్ర వాహం అధికమైంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లను ఒక ఫీటు పై కెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రా జెక్టులోకి 3,800ల క్యూసెక్కుల నీరు వస్తుండగా 4,905 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు కాగా 1189.2 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతున్నట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శంకర్

మంచిర్యాలటౌన్: వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన నల్ల శంకర్, కార్యదర్శిగా మైలారం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, హనుమంతరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మంగళవారం రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు.

29న బాసరకు ప్రత్యేక బస్సులు



భవానీ ప్రసాద్, ఆర్టీసీ ఆర్‌ఎం

ఆదిలాబాద్: బాసర పుణ్య క్షేత్రానికి ఈనెల 29న ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్.భవానీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరస్వతీదేవి జన్మదినం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని భక్తుల సౌకర్యార్థం ఆరు డి పోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించారు. రీజియన్ పరిధిలో ఎక్కడి నుంచి అయినా 30 మంది భక్తులు ఒకే చోట గ్రూపుగా ఉంటే డిపో మేనేజర్లను సంప్రదించి బస్సులను ప్రత్యేకంగా బుక్ చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు ఆదిలాబాద్, ఉట్నూర్ డిపో ల పరిధిలో 9959226002, నిర్మల్ 99592 26003, భైంసా 9959226005, ఆసిఫాబాద్ 9959226006, మంచిర్యాల 9959226004 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

యువకుడిపై కేసు

మంచిర్యాలక్రైం: బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు షీ టీమ్ ఎస్సై హైమ తెలిపారు. మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ యువకుడు, యువతి మూడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఆతర్వాత యువకుని ప్రవర్తనలో మార్పు రావడంతో యువతి దూరం పెట్టింది. జీర్ణించుకోలేని యువకుడు గతంలో ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను చూపిస్తూ వేధింపులకు పాల్పడ్డాడు. బాధితురాలు షీ టీమ్‌ను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్జీయూకేటీలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

బాసర: బాసర ఆర్జీయూకేటీలో మంగళవారం 56వ ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర విశిష్టమైనదన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సేవా దృక్పథం పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా మహిళా సాధికారతపై రూపొందించిన నృత్యనాటిక, బాల కార్మిక నిర్మూలనపై ప్రదర్శించిన నాటకం అందరి మనసులను కదిలించాయి. ఈ ప్రదర్శనలు సమాజంలో సున్నితమైన సమస్యలపై అవగాహన కలిగించడంతో పాటు యువతలో సామాజిక బాధ్యతను మేల్కొలిపాయి.

గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్: జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డు గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట ఉట్నూరు ఏఎస్పీ కాజల్ సింగ్, సీఐ ప్రభాకర్, ఎస్సై అఖిల్, సిబ్బంది ఉన్నారు.

వాటర్‌ట్యాంక్ ఎక్కి నిరసన



నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

మంచిర్యాలక్రైం: అక్రమంగా తమ భూమి కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓ కుటుంబం మంగళవారం జిల్లా కేంద్రంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపింది. మ్యాదరివాడకు చెందిన బొలిశెట్టి మల్లక్కకు ఇద్దరు కుమారులు మహేశ్, రాజేశ్ ఉన్నారు. మల్లక్క మూగ, రాజేశ్ మానసిక పరిస్థితి బాగోలేదు. మల్లక్క, రాజేశ్ పేరుమీద హాజీపూర్ మండలం దొనబండ శివారులో, సబ్బపల్లి శివారులో 4 ఎకరాల17 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని మంచిర్యాలకు చెందిన బొలిషెట్టి సావిత్రి, ముధం శ్రీలత అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మహేష్ ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు, హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆర్నెళ్లుగా పట్టించుకోవపోవడంతో మహేష్, అతని భార్య కీర్తన, కుమారుడు చంద్రశేఖర్‌తో కలిసి వాటర్ ట్యాంకు ఎక్కారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కిందకు దిగారు.

పత్తి చేనులో గంజాయి సాగు

కెరమెరి: పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.మధుకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం మండలంలోని ఇందాపూర్ గ్రామానికి వెళ్లి వాడై పోశెట్టి పత్తి చేనులో పరిశీలించగా 130 గంజాయి మొక్కలు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా గంజాయి సాగు, విక్రయం చేస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

నార్నూర్: మండలంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన జుగాదిరావు పంటచేనులో గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం దాడులు నిర్వహించి రూ.4.40 లక్షల విలువైన గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దాడికి దారి తీసిన ప్రేమ పెళ్లి

మంచిర్యాలక్రైం: ప్రేమ పెళ్లి దాడికి దారి తీసిన ఘటన వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బెల్లంపెల్లికి చెందిన మన్విత, ఏలూరి నరసింహచారి 20 రోజుల క్రితం ప్రేమ పెళ్లి చేసుకొని స్థానిక కాలేజ్ రోడ్‌లోని బాలాజీ బృందావన్ కాలనీలో ఉంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి వారిపై దాడిచేసి నరసింహచారిని కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. దాడికి పాల్పడింది నరసింహచారి కుటుంబ సభ్యులేనని యువతి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక సీఐ ప్రమోద్ రావును వివరాణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

తాంసి: ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను వెంటనే తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేశ్ కోరారు. మంగళవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుందెబ్బ, రాయి సెంటర్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల గిరిజనులతో కలిసి అంబుగాం నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు వెట్టి మనోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుక, ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఉయికే ఇంద్ర, తాంసి మండల అధ్యక్షుడు భరత్, ఆదివాసీ నాయకులు గణపతి, జ్ఞానేశ్వర్, పోచ్చన్న, నరేశ్, మాధవ్, మానిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఈపీ-2020కి హాజరైన మస్కాపూర్ ఉపాధ్యాయుడు

ఖానాపూర్: మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని సీసీఆర్‌టీలో జరుగుతున్న ఎన్ఈపీ-2020 కార్యక్రమానికి హాజరయ్యారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సమావేశంలో పలు రాష్ట్రాల నుంచి ఎంపికైన ప్రతినిధులు పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు. సమకాలీన విద్యా విధానంలో చోటు చేసుకుంటున్న మార్పులతో పాటు తెలంగాణ రాష్ట్రం వాటిని అనుసరించే విధానం గురించి సమావేశంలో విశదీకరించారు.